క్లుప్తంగా

అమూల్యకు సన్మానం



అమూల్యను సన్మానించిన సాగర్ షెట్కార్

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన అమూల్య ఎంబీబీఎస్‌లో ఉచిత సీటును సాధించింది. గురువారం యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్ ఆమెను శాలువాతో సన్మానించి నీట్‌లో అర్హత సాధించడం ఆమె కుటుంబానికే కాకుండా ఖేడ్ ప్రాంతానికే గర్వకారణమని కొనియాడారు. వైద్య విద్య పూర్తి చేసుకుని పేదలకు వైద్య సహాయం, సమాజ సేవకు పాటుపడాలని ఆకాంక్షించారు. మాజీ కౌన్సిలర్ వివేకానంద్, దత్తాత్రేయ స్వామి ఆలయ కమిటీ బాధ్యులు కాశీనాథ్ పటేల్, హన్మాండ్లు పాల్గొన్నారు.

ఉచితంగా షూస్ పంపిణీ



చిన్నారులకు షూస్‌లు అందజేస్తున్న ఆస్మా

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థులు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆస్మా సూచించారు. మ్యాజిక్ స్పోర్ట్స్ వారి సౌజన్యంతో మండల పరిధిలోని రేజింతల్ అంగన్‌వాడీలో గురువారం 60 మంది చిన్నారులకు షూస్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మల్లికారెడ్డి, రామేశ్వరీ, కమలమ్మ, రాణెమ్మ, పుణ్యవతి, సూర్యకళ, నిర్మల, అమూల్య, చాందిబీ పాల్గొన్నారు.


ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు దగ్ధమైన సంఘటన అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి కిష్టారెడ్డిపేటలో చోటు చేసుకుంది. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల కథనం ప్రకారం.. గురువారం ఉదయం పటాన్‌చెరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు పిల్లలను ఎక్కించుకునేందుకు అమీన్‌పూర్ కిష్టారెడ్డిపేట పరిధిలోని కల్యాణి ఎస్టేట్‌కు వచ్చింది. ఐదుగురు పిల్లలు బస్సులో ఉండగా పొగలు రావడంతో వెంటనే కిందికి దింపేశారు. పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లోని నీటి పైపు ఇవ్వడంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి వచ్చినట్టే వచ్చి మళ్లీ చెలరేగాయి. అప్పటికే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా దాదాపు అరగంట ఆలస్యంగా రావడంతో పూర్తిగా బస్సు దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బస్సు పూర్తిగా దగ్ధమైందని పాఠశాల యాజమాన్యం ఆరోపిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటల వ్యాపించి ఉండవచ్చని ఎంవీఐ విజయరావు తెలిపారు.

మాదకద్రవ్యాలను నియంత్రిద్దాం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్ : మాదకద్రవ్యాల నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంగారెడ్డి అధ్యక్షుడు రాజేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణ శివారులోని శిశు మందిర్ పాఠశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల యువత చెడు మార్గాల్లో వెళ్లే ప్రమాదం ఉందన్నారు. మాదక ద్రవ్యాల వల్ల శారీరక, మానసిక సమస్యలు, గుండె జబ్బులు, కాలేయ వ్యాధులు వంటి సంభవిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ వీటికి దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వామి గౌడ్, పాఠశాల ప్రధానాచార్యులు నరసింహగౌడ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళవేదికకు భూమి పూజ

సదాశివపేట(సంగారెడ్డి): మండలంలోని తంగేడపల్లి గ్రామ శివారులోని కోటి బిల్వలింగేశ్వర మఠంలో గురువారం శివయోగి శివచార్య మహాస్వామి ఆధ్వర్యంలో నిజాంపూర్ చంద్రమ్మ, రఘునాథ్‌ల జ్ఞాపకార్థం గురువారం గంగధర మంగళవేదిక నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నిజాంపూర్ నిర్మల, బెజుగం జగదీశ్వర్, సాగర్, కుటుంబ సభ్యులు అర్చకులు భక్తులు పాల్గొన్నారు.



సదాశివపేట: సాయిబాబా మందిరంలో భక్తులు



బీహెచ్‌ఈఎల్‌లోని బీవీబీలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న పరమానందప్రభు, ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, భానునిర్మల

ఘనంగా గురుపౌర్ణమి

జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులతో ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. క్యూలైన్ నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అన్నదానం చేశారు.



కల్హేర్: ప్రవచనం చేస్తున్న కరణ్ గజేంద్ర భారతి మహరాజ్



కంగ్టి: గురుపౌర్ణమిలో పాల్గొన్న గోపాల్ మహరాజ్ రాందాసీ



జిన్నారం : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆనంద్‌కృష్ణారెడ్డి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి



శివలింగానికి ప్రత్యేక పూజలు



నారాయణఖేడ్: కాశీనాథ్‌బాబాకు తులాభారం నిర్వహిస్తున్న భక్తులు



జహీరాబాద్ టౌన్: వెంకటయ్యను సన్మానిస్తున్న పూల సంతోష్ తదితరులు

నిస్వార్థ సేవలు లయన్స్ క్లబ్‌తోనే సాధ్యం

డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మి

వట్‌పల్లి(అందోల్): నిస్వార్థ సేవలను అందించడమే లయన్స్ క్లబ్ ముఖ్య ఉద్దేశమని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.లక్ష్మి అన్నారు. గురువారం వట్‌పల్లి లయన్స్ క్లబ్ 9వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 1917వ సంవత్సరంలో ఏర్పడిన లయన్స్ క్లబ్ నేటికి వందల సంఖ్యలో క్లబ్‌లను ఏర్పాటు చేసుకొని లక్షలాది మందికి సేవలను అందిస్తుందన్నారు. తాను కూడా తాను 1200 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నానని, లయన్స్‌క్లబ్‌లో చేరడం వల్లనే తనకు సేవ చేసే అలవాటు అయిందన్నారు. విపత్కర పరిస్థితుల్లో, ఆపదలు వచ్చినప్పుడు ప్రభుత్వాల కంటే ముందుగానే లయన్స్‌క్లబ్ స్పందించి కోట్లాది రూపాయలు వెచ్చించిన సందర్భాలున్నాయన్నాయని వివరించారు. అనంతరం కొత్త పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.



పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మిని సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

వట్‌పల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా కిషన్‌రావు, ఉపాధ్యక్షుడిగా సిద్దేశ్వర్‌గౌడ్, కార్యదర్శిగా మధు, ట్రెజరర్ మోసిన్, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్‌గౌడ్, పీఆర్‌ఓ మల్లయ్య, గోపాల్‌గౌడ్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్ కుమ్మరి పెద్దన్న, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ బస్వేశ్వర్‌రావు, సెకండ్‌వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నర్సింహారాజు, డాక్టర్ అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లు కల్తీకి పాల్పడే వారిపై చర్యలు

నారాయణఖేడ్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లిలో హైదర్‌గూడ, కుషాయిగూడ, ఇందిరానగర్ కల్లు డిపోల్లో కల్లు తాగి ఆరుగురు చనిపోయిన ఘటన నిజమైతే అందుకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అంజాగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గీత కార్మికులు స్వచ్ఛమైన ప్రకృతి పానీయాన్ని ప్రజలకు అందిస్తున్నారని, ఇది ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు కల్లు కల్తీకి పాల్పడడం వల్ల గీత కార్మికులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కల్లులో కల్తీ జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇందిరా మహిళా శక్తిపై కళాప్రదర్శన



ప్రభుత్వ పథకాలను పాటలతో వివరిస్తున్న కళాకారులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రమైన జిన్నారం, దాదిగూడెం గ్రామాల్లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను, స్వశక్తితో ఎదుగుదలకు అందిస్తున్న ప్రోత్సాహాలను కళా ప్రదర్శన ద్వారా పొదుపు సంఘాల మహిళలకు కళాకారుల ఆటాపాటలతో అవగాహన కల్పించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం నరేందర్, సీసీలు జేజీ, భారతి, సుజాత, వీఓఏ నిర్మల, కళాకారులు దుర్గేష్, వినేష్, నవీన్, సంధ్య, శంకర్, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

పూజారి భవానికి డాక్టరేట్



పూజారి భవాని

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్‌కు చెందిన పూజారి భవాని ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లోఆమె చేసిన పీహెచ్‌డీ పరిశోధనాత్మక విశ్లేషణలో ప్రొఫెసర్ వెంకటరెడ్డి భవానికి మార్గదర్శనం చేశారు. డాక్టరేట్ పట్టా అందుకోవడంపై పట్టణవాసులు భవాని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

జిన్నారం (పటాన్‌చెరు): 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్యపల్లి, ఖాజీపల్లి, ఖాజీపల్లి క్రషర్ల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు గుమ్మడిదల ఏడీఈ దుర్గాప్రసాద్, జిన్నారం ఏఈ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మొక్కలు నాటి సంరక్షించండి

నారాయణఖేడ్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని నిజాంపేట్ ఎంపీడీఓ సంగ్రాం సూచించారు. నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామంలోని హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల వద్ద మొక్కలను నాటారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

సంక్షిప్త వార్తలు

◆ రక్తదానంతో ప్రాణదానం

నారాయణఖేడ్: పట్టణంలోని సాయి సంజీవని ఆస్పత్రిలో గురువారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 60మంది దాతలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డా.జగన్మోహన్ మాట్లాడుతూ.. ఒక యూనిట్ రక్తం అనేక మందికి ప్రాణదాయకం అవుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు.

◆ నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉ.10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు ఆర్టీసీకి సంబంధించిన సేవలు, సమస్యలు, సౌకర్యాల మెరుగు కోసం సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. 9959223170 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్ చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 8 మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, మరో ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని భీంరా, నాగూర్(కే), పర్తుతండా ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ మహ్మద్ రఫీయోద్దీన్ గురువారం పరిశీలించారు. విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు చతుర్విధ ప్రక్రియల్లో కనబరుస్తున్న ప్రతిభా పాటవాలు పరిశీలించి.. తగు సూచనలు చేశారు.

◆ ఆర్వో ప్లాంట్ ప్రారంభం

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ఎస్టీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు తాగునీటి పరిశుభ్రత కోసం ప్లాంట్ ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎంపీఓ సుభాష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ జీపీఓ నియామకానికి దరఖాస్తులు

సంగారెడ్డి జోన్: గ్రామపాలన అధికారుల నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని డీఆర్‌ఓ పద్మజ రాణి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ.. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం ద్వారా నోటిఫికేషన్ జారీ అయినట్లు తెలిపారు. గతంలో రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల https://forms.gle/rBDToMsakRcoPoivWA ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ తల్లిదండ్రులకు పాదపూజ

ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం ఎంతో ముఖ్యం. గురుపౌర్ణమి దినోత్సవాన్ని పురస్కరించుకుని దత్తగిరి మహారాజ్ ఆశ్రమ వైదిక పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. గురువారం ఆశ్రమ ఆవరణలో విద్యార్థులు వినూత్నంగా వేదమంత్రోచ్ఛరణల మధ్య పాదపూజ చేసి, ఆశీర్వాదం పొందారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మాజీ మంత్రి భగవత్ కుభా హాజరయ్యారు.

విగ్రహం ఏర్పాటుకు స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారి విస్తరణలో భాగంగా డైమండ్ చౌరస్తా వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఇక్రిశాట్ చౌరస్తాలో ఏర్పాటు చేసేందుకు గురువారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్థానిక నేతలు కలిసి స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. డైమండ్ చౌరస్తా వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని మరోచోటకి తరలించాల్సి వస్తుందని తెలిపారు. పట్టణ ప్రముఖులతో పాటు ఆయా దళిత సంఘాల ప్రతినిధులతో చర్చించి విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని చూశామని తెలిపారు. దీంతో ఇక్రిశాట్ చౌరస్తాలో విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందుకు త్వరలో విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల డీఈ రామకృష్ణ, నాయకులు నగేష్, పరమేష్ యాదవ్, దళిత సంఘాల ప్రతినిధులు, రుద్రారం శంకర్, కావలి శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి



ప్రారంభమైన అంగన్‌వాడీ కేంద్రంవద్ద ఎమ్మెల్యేతో విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది

జిన్నారం /పటాన్‌చెరు: ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధికి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. జిన్నారం మండలంలోని కొడకంచి గ్రామంలో రూ.62 లక్షల నిధులతో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని తాబేలు గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న జీవనజ్యోతిర్లింగ ఆలయ పనులను పటాన్‌చెరులోని గోకుల్‌నగర్‌లో నిర్మిస్తున్న కల్యాణ మండపాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో సొంతనిధులతో సుమారు 200 దేవాలయాలు నిర్మించామన్నారు. ఆలయ నిర్మాణం, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో యాదవ సంఘం కల్యాణ మండపం పనులు శరవేగంగా జరుగుతున్నాయని..త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని చెప్పారు. అనంతరం గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు, జిన్నారం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి తండ్రి మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుంది

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్, పీఎంఓ కార్యాలయ డైరెక్టర్ మన్మీత్ కౌర్



డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సందర్శించిన పీఎంఓ కార్యాలయ డైరెక్టర్ మన్మీత్ కౌర్, కలెక్టర్ ప్రావీణ్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు పక్కా ఇళ్ల నిర్మాణాల కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన, డబుల్ బెడ్ రూమ్ పథకాలతో పక్కా ఇల్లు నిర్మించి వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య స్పష్టం చేశారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేసీఆర్ నగర్, డిగ్నిటీ కాలనీలను కలెక్టర్ ప్రావీణ్యతో కలసి ప్రధానమంత్రి కార్యాలయం డైరెక్టర్ మన్మీత్ కౌర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో ఆస్పత్రి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు మరిన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, గృహనిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ చైతన్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి, ఆర్‌డీఓ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, మున్సిపల్ కమిషన్ అజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులను అడ్డుకుంటాం



ధర్నా చేస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లిలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులపై ఆర్అండ్‌బీ అధికారులు స్పష్టత ఇవ్వకుండా ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని స్థానికులు గురువారం రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారితో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా 60 అడుగుల దూరం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని మార్కింగ్ ఇచ్చి అడ్డుగా ఉన్న షాపులతో పాటు ఇళ్లను తొలిగించాలని అధికారులు తమకు నోటీసులు అందజేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ షాపులను తొలిగించుకున్నామని, మరి కొందరు తొలిగించలేదన్నారు. అభివృద్ధికి తాము సహకరిస్తామని రోడ్డు విస్తరణలో 60 అడుగుల లేదా 40 అడుగులా ఎంత తీసుకుంటారనే విషయమై స్పష్టత ఇచ్చి పనులు చేపట్టాలన్నారు. కొందరు వ్యక్తులను కాపాడే ప్రయత్నంలో ఇష్టమొచ్చినట్లు పనులు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అశోక్ గౌడ్ , ఏఎంసీ మాజీ డైరెక్టర్ మధు, గుండయ్య, రవి ,అఖిల్, దస్తగిరి, మోహిన్ పాల్గొన్నారు.

ఫిట్‌మెంట్, పదోన్నతులకు కృషి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న లక్ష్మణ్

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

నారాయణఖేడ్: ఉపాధ్యాయులకు మెరుగైన ఫిట్‌మెంట్, హెల్త్ కార్డులు, బదిలీలతో కూడిన పదోన్నతులు ఇచ్చేలా కృషి చేయనున్నట్లు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ పేర్కొన్నారు. నారాయణఖేడ్ మండలం చాప్టా(కె) జిల్లా పరిషత్తు పాఠశాలలో గురువారం ఖేడ్ అర్బన్, రూరల్ మండలాల సంఘం అధ్యక్షుడు పి.భీమ్‌రావు, శివరాం నాయక్‌లతో కలిసి సంఘం ఇన్సూరెన్స్‌తో కూడుకున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే గురుకులాల సమయపాలన కూడా మార్పు చేసేలా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. ఉపాధ్యాయులకు రావాల్సిన వివిధ రకాల జెడ్పీ జీపీఎఫ్, పార్ట్ ఫైనల్, టీఎస్ జీఎల్ఐ, సరెండర్ లీవ్స్ తదితర ఆర్థిక పరమైన బకాయిలను ఈనెలాఖరులోపు ఉపాధ్యాయులు వ్యక్తిగత ఖాతాల్లో జమ అయ్యేలా చూస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడే దేవీసింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కం పాండురంగారెడ్డి, నాయకులు కిఫాయత్ అలీ, హనుమాండ్లు, మల్లయ్య పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు మాణయ్య అన్నారు. గురువారం జోగిపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2025 సంవత్సర పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు సాధించే ఏకైక సంఘం పీఆర్టీయూ మాత్రమేనని, రాష్ట్రంలో అగ్రశ్రేణి సంఘంగా, ఉపాధ్యాయ సంక్షేమమే ధ్యేయంగా సంఘం పనిచేస్తుందని అన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వం నమోదు

జహీరాబాద్ టౌన్: మండలంలోని పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామని జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరాం రాథోడ్ తెలిపారు. గురువారం మండలంలోని పలు పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టమన్నారు. టీచర్లకు ఇన్సూరెన్స్‌తో కూడిన సభ్యత్వం ఇచ్చామన్నారు.